ఇకపై సరికొత్త పరిపాలన

• కుత్బుల్లాపూర్‌లో వైభవంగా వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవం



గణేష్‌గ్రాండ్‌లో వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కార్పొరేటర్ హేమలతరెడ్డి



జగద్గిరిగుట్టలో వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్



జీడిమెట్లలో వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ఎనిమిది డివిజన్లలోని వార్డు కార్యాలయాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జగద్గిరిగుట్ట డివిజన్‌లోని మోడల్ మార్కెట్ భవనంలో వార్డు కార్యాలయాన్ని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై కార్పొరేటర్ జగన్‌గతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా సుభాష్ నగర్ డివిజన్ పరిధి గణేష్‌గ్రాండ్‌లో వార్డు కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

◆ కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్–2 కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ గౌరీష్ పారిజాత, సూరారం డివిజన్ నెహ్రూనగర్ సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ప్రారంభించారు.

◆ చింతల్ డివిజన్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ రషీదాబేగం, రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ కమిటీ హాలులో వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, జీడిమెట్ల డివిజన్ గాయత్రినగర్‌లో వార్డు కార్యాలయాన్ని ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, గాజులరామారం డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ రావుల శేషగిరి లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత, ఉప కమిషనర్లు మంగతాయారు, ప్రశాంతి, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించని కాంట్రాక్టర్లకు బిల్లులు ఎలా చెల్లిస్తున్నారు?



సమావేశంలో మాట్లాడుతున్న నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు సతీష్

నిజాంపేట్: అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నా కాంట్రాక్టర్లకు ఎలా బిల్లులు చెల్లిస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ప్రశ్నించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయమై శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... కార్పొరేషన్ పరిధిలో గత మూడేళ్లలో రూ.140 కోట్ల నిధులు వెచ్చించి 287 చోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు జరిగాయని అన్నారు. అయితే నాణ్యతా ప్రమాణాలను పరిశీలించకుండానే ఇంజినీరింగ్ అధికారులు బిల్లులు చెల్లించారని ఆరోపించారు.

◆ శ్రీహోమ్స్ కాలనీలోని రూ.40 లక్షల నిధులతో వేసిన రోడ్డుకు పగుళ్లు వచ్చాయని తెలిపారు. అదే విధంగా సాయి నగర్ లో 90 లక్షలతో డిస్టింగ్ వర్క్ లో అంచనాలు పెంచారని ఆరోపించారు. నిజాంపేట్ బండారు లేఔట్‌లో పని చేయకుండా కాంట్రాక్టర్‌కు రూ.10లక్ష బిల్లులు చెల్లించారని తెలిపారు.

◆ అదే విధంగా కమిషన్లకు కక్కుర్తి పడి డంపింగ్‌యార్డ్ కాంట్రాక్ట్ శివశక్తి ఎంటర్‌ప్రైజెస్‌కు అప్పగించారన్నారు. అభివృద్ధి పనుల విషయంలో మేయర్ భర్త తలదూర్చి కమిషన్లు దండుకుంటున్నాడని పేర్కొన్నారు.

◆ ఇంజినీరింగ్ అధికారులు సైతం అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు వత్తాసు పలుకుతూ పర్యవేక్షణను గాలికొదిలేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి పనుల విషయంలో జిల్లా అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

◆ ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రామ చంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్, సెక్రటరీ శేషారావు మహిళా మోర్చా సెక్రటరీ మంజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హంగు, ఆర్భాటాల కోసమే ప్రగతియాత్ర



బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: హంగు, ఆర్భాటాల కోసమే ఎమ్మెల్యే వివేకానంద్ ప్రగతియాత్ర చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణ పనులను కాలనీవాసులతో పరిశీలించిన శ్రీశైలంగౌడ్ ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. గ్రీన్‌హిల్స్ కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజ్, దోమల బెడద వంటి సమస్యలను కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజ్ పనులు పూర్తయిన ప్రాంతాల్లోనే ఎమ్మెల్యే వివేకానంద్ ప్రగతి యాత్ర చేస్తూ పూల వర్షం కురుపించుకుంటున్నారని విమర్శించారు. పనులు చేయని చోట్ల ముఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేసారు. ఎమ్మెల్యేకు ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే గ్రీన్‌హిల్స్ కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం



క్షతగాత్రుడు సురేష్‌కు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న బండి శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: ఆస్పత్రిలో బిల్లు కట్టలేని పరిస్థితిలో ఉన్న ఓ పేషెంట్‌కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ నేత నర్సారెడ్డి భూపతిరెడ్డి అండగా నిలిచారు. కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన సురేష్ కారు నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఐదు రోజుల క్రితం తన కారులో కోదాడ వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో రోడ్డు పక్కన కారులోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇది గమనించిన వాహనదారులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సుచిత్రలోని రష్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కొంత నగదు చెల్లించగా మరో రూ.40వేలు కట్టాల్సిందిగా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. సదరు మొత్తాన్ని బాధిత కుటుంబానికి శుక్రవారం శ్రీనివాస్‌గౌడ్ అందజేసి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి

నిజాంపేట్: విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం, కార్పొరేట్ విద్యా సంస్థలు ఆటలాడుకుంటున్నాయని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ అన్నారు. శుక్రవారం బాచుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అధిక ఫీజులను వసూలు చేయడంతో పాటు అధిక ధరలకు పాఠ్య పుస్తకాలను అంటగడుతున్నాయని ఆరోపించారు. గతంలో సైతం విద్యాసంస్థల వ్యవహార శైలిపై ఆరోపణలు వచ్చినా విద్యాశాఖాధికారులు స్పందించడం లేదన్నారు. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలన్నారు. అదేవిధంగా పాఠ్య పుస్తకాలను తక్కువ ధరలకు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని శివకుమార్ డిమాండ్ చేశారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



చింతల్‌లో ప్రచారం చేస్తున్న మల్లారెడ్డి, నాయకులు

చింతల్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహా జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చింతల్ డివిజన్‌లో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన నిధులను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతో పథకాలు అమలు చేస్తూ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల్లో తగు గుణపాఠం చెబుతారన్నారు.

వెయ్యి మంది కార్మికులకు అన్యాయం చేసినా పట్టించుకోరా?

జీడిమెట్ల: రిలే నిరాహారదీక్ష చేస్తున్న తమను ఎవరూ పట్టించుకోవడం లేదని సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ ఉద్యోగులు అంటున్నారు. శుక్రవారంతో నిరాహారదీక్ష చేపట్టి 110రోజులైన న్యాయం జరగడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు తీసుకువచ్చే బీఆర్ఎస్ నాయకులు తమ గోడు తెలిసినప్పటికి తమకు న్యాయం చేయడం లేదని వారు అంటున్నారు. రాష్ట్రంలో ఓ పరిశ్రమ వెయ్యి మంది కార్మికులకు అన్యాయం చేసినా ప్రభుత్వ పెద్దలకు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో కార్మికులకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున నిరసనలకు దిగుతామని వారు అంటున్నారు. రిలేనిరాహారదీక్షలో కార్మికులతో పాటు బీఆర్ఎస్ నేత పప్పిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.